News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :286 | ఖమ్మం | గురువారం నవంబర్ 27, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# పలు రైల్వే ప్రాజెక్ట్ లకు కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు




న్యూ ఢిల్లీ, నవంబర్ 26: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూ ఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (రేంప్)కు రూ.7,280 కోట్లు కేటాయించిందని తెలిపారు. పుణె నగరంలో మెట్రో రైలు పొడిగింపునకు రూ.9,858 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేవభూమి ద్వారక - కర్నాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అందుకు రూ.1,457 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బద్లాపూర్ - కర్జాత్ థర్డ్, ఫోర్త్ రైల్వే పనులకు సైతం అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఈ రోజు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19, 919 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తవుతాయని మంత్రి అశ్విని వైష్ణవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.మంబై సమీపంలోని బద్లాపూర్ - కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్‌లకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు ద్వారా లక్షలాది

వివరాలు 2లో..

# హైదరాబాద్‌ను ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించండి



## ప్రధాని మోదీని కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
## తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమిట్‌కు ఆహ్వానం




- సులభతర వ్యాపారానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ప్రధాని నరేంద్ర మోదీ
- హైదరాబాద్‌లో శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం ప్రారంభం
- భారత్‌కు త్వరలో విమాన తయారీ కంపెనీలు: రామ్మోహన్‌నాయుడు
- రఫేల్ ఇంజిన్లనూ ఇక్కడే అసెంబుల్ చేస్తాం: సంస్థ సీఈవో ఒలివియర్

"భారత్ కలలు కనడంతోనే ఆగి పోలేదు. వాటిని నిజం చేస్తోంది. సులభతర వ్యాపారానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇక్కడికి వస్తున్న విదేశీ సంస్థలను వికసిత్ భారత్ లో భాగస్వాములుగా చూస్తోంది" అని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు.



వివరాలు 2లో..



# నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు..

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం

- కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచన
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్న ఎన్నికల కమిషనర్

వివరాలు 2లో..

# భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

- భారత్ ఎప్పటికీ ఒక్కటే అని రాజ్యాంగం నిరూపించింది : ఉప రాష్ట్రపతి
- రాజ్యాంగాన్ని అనుసరిస్తే 2047 కల్లా వికసిత్ భారత్ స్పీకర్ ఓంబిర్లా




న్యూ ఢిల్లీ : దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూ ఢిల్లీ లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ సభలో ఆమె ప్రసంగిస్తూ శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని, మన ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం ఇది అని చెప్పారు. ప్రజల స్వాభిమానాన్ని కాపాడే ఎన్నో హక్కులను కల్పించిందన్నారు.

వివరాలు 2లో..

# బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విధులు పునాది

న్యూ ఢిల్లీ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాని మోదీ దేశ పౌరులను వుద్దేశించి రాసిన లేఖ ద్వారా తన సందేశాన్ని వినిపిస్తూ దేశం లోని పౌరులందరూ రాజ్యాంగ విధులను ఆచరించాలి అని కోరారు. ఇది వికసిత్ భారత్ నిర్మాణానికి అర్థవంతంగా దోహదపడుతుంది అని ఆయన లేఖలో పేర్కొన్నారు. మన రాజ్యాంగం ఒక స్పష్టత, దృఢనిశ్చయంతో దేశ పురోగతికి మార్గనిర్దేశం చేస్తున్న



వివరాలు 2లో..

# ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజ్యాంగాన్ని చదవాలి

- కాన్స్‌టిట్యూషన్‌పై నేతలకు పరీక్ష పెట్టాలి: ఎంపీ వంశీకృష్ణ
- రాజ్యాంగ పీఠికపై అంబేద్కర్ లా కాలేజీలో నిర్వహించిన సదస్సుకు హాజరు

రాజ్యాంగాన్ని ఎమ్మెల్యేలు, ఎంపీలు క్షుణ్ణంగా చదవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. రాజ్యాంగంపై లీడర్లకు పరీక్ష పెట్టాలని తెలిపారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీలో రాజ్యాంగ పీఠికపై బుధవారం సదస్సు జరిగింది. సమిట్?కు




వివరాలు 2లో..

# 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, 17 శాతానికి తగ్గించారు

- రిజర్వేషన్ల తగ్గింపు, ప్రజాధనం దుర్వినియోగంపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్
- కులగణన ఆదర్శమని రాహుల్ గాంధీ చెప్పారు కానీ ఉన్న రిజర్వేషన్లు తగ్గించారని వ్యాఖ్య
- హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపణ




స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, ఉన్న 24 శాతం నుంచి 17 శాతానికి తగ్గించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రిజర్వేషన్ల తగ్గింపు, ప్రజాధనం దుర్వినియోగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శమని రాహుల్ గాంధీ అన్నారని, కానీ ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా తగ్గించారని విమర్శించారు.కేటీఆర్ ఈరోజు వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వివరాలు 2లో..

# ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం...

## మాగంటిపై కేసు వెనక్కి తీసుకున్నానని వెల్లడి

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన నవీన్ యాదవ్
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ
- సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని ఆవేదన
- ఉప ఎన్నికలో మద్దతిచ్చిన ఎంఐఎంకు కృతజ్ఞతలు తెలిపిన నవీన్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే గా కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆయనతో ప్రమాణం



వివరాలు 2లో..


# స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పోటీ చేయాలి



స్థానిక సంస్థల ఎన్నికల బరిలో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను రంగంలోకి దించి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన అధ్యక్షతన బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం జరిగింది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, భాజపా జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ..అన్ని గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ శ్రేణులు బలమైన మద్దతు అందించి, అత్యధిక స్థానాల్లో గెలిపించాలి. గ్రామాల అభివృద్ధికి నిధులిస్తుంది కేంద్ర ప్రభుత్వమే. ఈ విషయాలను ప్రజలకు వివరించాలి' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# ఎస్టీలకు పెరిగిన రిజర్వేషన్లు

- 2019తో పోల్చితే బీసీలకు ఎనిమిది జిల్లాల్లో లబ్ధి
- పంచాయతీరాజ్ శాఖ నివేదిక




: 'పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీలకు రిజర్వు అయిన స్థానాలు పెరిగాయి. 2019లో ఎస్టీ పంచాయతీల సంఖ్య 1,177 ఉండగా.. 2025లో అది 1,248కు పెరిగింది. నాన్ షెడ్యూల్డు గ్రామ పంచాయతీల్లోనూ ఎస్టీలకు 688 నుంచి 714కు పెరిగాయి. 2019తో పోల్చితే బీసీలకు ఎనిమిది జిల్లాల్లో రిజర్వేషన్లు పెరిగాయి. నాన్ షెడ్యూల్డు పంచాయతీల్లో పెరిగిన ఎస్టీ రిజర్వేషన్లు తదితరాల ప్రభావం ఇతర వర్గాలపై స్వల్పంగా పడింది. షెడ్యూల్డు ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లు వర్తించవు' అని పంచాయతీరాజ్ శాఖ నివేదిక వెల్లడించింది. సర్పంచుల రిజర్వేషన్ కోసం మండలాన్ని ఒక యూనిట్‌గా.. వార్డులకు పంచాయతీని యూనిట్‌గా తీసుకుంటారని నివేదిక వెల్లడించింది.

**నివేదికలో ముఖ్యాంశాలు..**

2019 ఎన్నికల్లో మొత్తం 12,751

వివరాలు 2లో..

# హైదరాబాద్‌ను ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించండి

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంగణంలోని జీఎంఆర్ ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ పార్క్ సెజ్‌లో రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన శాఫ్రన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా(ఎస్ఏఈఎస్ఐ) కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రన్ ఏర్పాటు చేసిన విమాన లీప్ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతు, సమగ్ర సేవల(ఎంఆర్‌వో) కేంద్రం భారత్‌ను ఈ రంగంలో నూతన హబ్‌గా మారుస్తుంది. విమానయాన రంగంలో యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ విమానయాన మార్కెట్‌లలో భారత్ ఒకటి. మూడో అతిపెద్ద మార్కెట్ కూడా. దేశంలో విమాన ప్రయాణానికి నిరంతరం గిరాకీ పెరుగుతోంది. భారత విమాన సంస్థలు 1,500పైగా కొత్త విమానాలకు ఆర్డర్లు ఇవ్వడం హర్షణీయం. ఈ విస్తరణ వేగం కారణంగా ఎంఆర్‌వో అవసరాలూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు మన విమానాల మరమ్మతులు 85% విదేశాల్లోనే జరుగుతున్నాయి. దీనివల్ల ఖర్చు పెరుగుతోంది. సమయమూ వృథా అవుతోంది. విమానాలు ఎక్కువకాలం నేలమీదే ఉండాల్సిన పరిస్థితి. మనలాంటి భారీ విమానయాన మార్కెట్‌కు ఇది సరికాదు. అందుకే, భారత ప్రభుత్వం ఇప్పుడు దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఎంఆర్‌వో కేంద్రంగా అభివృద్ధి చేస్తోంది. కేవలం విమానయాన రంగంతోనే ఆగిపోవడం లేదు. నౌకలకు సంబంధించిన ఎంఆర్‌వో వ్యవస్థపైనా చాలాపెద్ద స్థాయిలో పనిచేస్తున్నాం. ఇవన్నీ దక్షిణ భారత యువతకు అనేక ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. చాలా రంగాల్లో 100% ఎఫ్‌డీఐలు సాధ్యమవుతున్నాయి. రక్షణ రంగంలోనూ 74% అనుమతించాం. అంతరిక్ష రంగంలోనూ ఎన్నో విధాన నిర్ణయాలు తీసుకున్నాం. 11 ఏళ్లలో 40 వేలకు పైగా నిబంధనలను సరళీకరించాం. ఇలాంటి ప్రయత్నాలతోనే ప్రపంచం ఇప్పుడు భారత్‌ను ఒక విశ్వసనీయమైన భాగస్వామిగా, పెద్ద మార్కెట్‌గా, తయారీ కేంద్రంగానూ చూస్తోంది. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం అంటే, తెలివైన నిర్ణయం తీసుకున్నట్లే అని నిరూపితం అవుతోంది" అని అన్నారు. భారత్‌లో విమాన ఇంజిన్లు, భాగాల డిజైన్, అభివృద్ధి అవకాశాలనూ పరిశీలించాలని శాఫ్రన్‌ను మోదీ కోరారు.

**రూ.15,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా: రామ్మోహన్ నాయుడు**

భారత విమానయాన రంగం గత పదకొండేళ్లలో రెట్టింపు వృద్ధిని సాధించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఉడాన్ పథకాన్ని కేంద్రం మరో పదేళ్లకు పొడిగించిందని... 19, 42, 72 సీట్ల చిన్న విమానాలతో వచ్చే అంకురాలనూ ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... "ప్రస్తుతం ఎంఆర్‌వో రంగంలో ప్రపంచ సగటు వృద్ధి రేటు 4.8% కాగా భారత్‌ది 8.9%. 2031 నాటికి భారత ఎంఆర్‌వో మార్కెట్ రూ.36 వేల కోట్లకు చేరుతుంది. లీప్ ఇంజిన్ల నిర్వహణ, ఇతర సేవల కోసం విమానయాన సంస్థలు సింగపూర్, మలేసియా, ఇండోనేసియాపై ఆధారపడుతున్నాయి. ఇకపై ఇదంతా హైదరాబాద్‌లోనే జరుగుతుంది. దీనివల్ల రూ.15,000 కోట్లకుపైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. విమానయాన సంస్థల ఖర్చులూ తగ్గి, ఆ మిగులు ప్రయాణికులకు చేరుతుంది. భారత్‌లో తయారీ, భారత్‌లో శిక్షణ తర్వాత ఇప్పుడు భారత్‌లో నిర్వహణ అనేది బలంగా వినిపిస్తోంది. శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం వచ్చినట్లుగానే త్వరలో భారత్‌కు విమాన తయారీ కంపెనీలూ వస్తాయి. హైదరాబాద్ విమానాశ్రయం కోసం విశాలమైన భూమిని సేకరించిన అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ముందుచూపు గొప్పది. ఈ కారణంగానే ఇప్పుడు అనేక సంస్థలు హైదరాబాద్‌లో వాటి అంతర్జాతీయ కేంద్రాలను నెలకొల్పేందుకు ముందుకొస్తున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమూ ఈ రంగం వృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తోంది. దేశంలో చాలా ఏవియేషన్ హబ్‌లు ఏర్పాటవుతున్నాయి. తెలంగాణ, కర్ణాటకలతోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది" అని తెలిపారు.

**భారత్‌కు ఐదోతరం ఫైటర్ ఇంజిన్ సాంకేతికత: ఒలివియర్ ఆండ్రిస్**

లీప్ ఇంజిన్ ఎంఆర్‌వోను ప్రారంభించిన సందర్భంగా శాఫ్రన్ గ్రూపు సీఈవో ఒలివియర్ ఆండ్రిస్ మాట్లాడుతూ.. "భారత్‌లో పౌర విమానయాన మార్కెట్ ఏటా 10% మేర వృద్ధి చెందుతోంది. భారత్‌లో కొత్తగా వస్తున్న నారో-బాడీ విమానాల్లో 80% మా లీప్ ఇంజిన్లతోనే నడుస్తాయి. అందుకే, ఇక్కడ ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఎంఆర్‌వోను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసినప్పుడు ఏడాదికి 300లకు పైగా లీప్ ఇంజిన్లకు సేవలందిస్తాం. 2030 నాటికి భారత్‌లో మా టర్నోవర్ రూ.27,000 కోట్లకు చేరుతుంది. ఇందులో సగం ఇక్కడ తయారైన ఉత్పత్తులు, సేవల నుంచి వస్తాయి. భారత్‌లో తయారీకి ఇది మా బలమైన మద్దతు. గత 70 ఏళ్లుగా భారత సైనిక దళాలకు మేం బలమైన భాగస్వాములం. రఫేల్ ఫైటర్ జెట్ ఇంజిన్ (ఎం88) ఎంఆర్‌వోనూ ఫ్రాన్స్ తర్వాత మొదటిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాం. భారత్ మరిన్ని జెట్లకు ఆర్డర్లిస్తే... భవిష్యత్తులో ఇక్కడే ఇంజిన్ అసెంబ్లింగ్, విడిభాగాల తయారీ చేపడతాం. ఫ్రాన్స్ ప్రభుత్వం మద్దతుతో ఐదో తరం ఫైటర్ జెట్ ఇంజిన్ సాంకేతికతను భారత్‌కు 100% బదిలీ చేసేందుకు శాఫ్రన్ కట్టుబడి ఉంది. భారత్ అభివృద్ధి చేస్తున్న 'అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎంసీఏ) కోసం పూర్తి సాంకేతికత బదిలీ జరుగుతుంది" అని వివరించారు.

# ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజ్యాంగాన్ని చదవాలి

- మొదటి పేజి తరువాయి

నల్సార్ యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావుతో కలిసి ఎంపీ వంశీకృష్ణ హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వంశీకృష్ణ మాట్లాడారు. "గొప్ప ఆశయంతో అంబేద్కర్ విద్యా సంస్థలను కాకా నెలకొల్పారు. అందుకు విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి. చదువుతో పాటు చట్టాలు.. సమాజంలో జరుగుతున్న నేరాలను లా విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి"అని వంశీకృష్ణ సూచించారు. రాజ్యాంగానికి మూలం రూల్ ఆఫ్ లా అని నల్సార్ వీసీ శ్రీకృష్ణదేవరావు అన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. లా విద్యార్థులు చురుగ్గా ఉంటూ ప్రాక్టికల్స్ చేసి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ పీఠికపై ఇచ్చిన ప్రజెంటేషన్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను బహుమతులను ప్రదానం చేశారు.

కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పీవీ రమణ కుమార్, సీఈవో లింబాద్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సృజనతో పాటు ఫ్యాకల్టీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్టీలకు పెరిగిన రిజర్వేషన్లు

- మొదటి పేజి తరువాయి

గ్రామాల్లో 10,293 నాన్ షెడ్యూల్డు గ్రామాలు కాగా అందులో ఎస్టీలకు 688 స్థానాలు(6.68శాతం) రిజర్వ్ అయ్యాయి. ఎస్సీలకు 2,133(20.53 శాతం), బీసీలకు 2,345(22.78 శాతం) దక్కాయి. నీ మొత్తం 12,760 స్థానాల్లో 10,233 నాన్ షెడ్యూల్డు కాగా అందులో ఎస్టీలకు 714(6.99 శాతం), ఎస్సీలకు 2,090(20.45 శాతం), బీసీలకు 2,186(21.39 శాతం) సీట్లు రిజర్వ్ అయ్యాయి. నీ 2019లో మొత్తం సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాల్లో 50 శాతం నుంచి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మినహాయించిన తర్వాత మిగిలినవి బీసీలకు రిజర్వు చేశారు. 2025లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం నుంచి ఎస్సీ, ఎస్టీలకు మినహాయించిన తర్వాత మిగిలిన శాతం.. జనాభాలో బీసీల నిష్పత్తి.. వీటిలో ఏది తక్కువ ఉంటే దాన్ని పరిగణనలో తీసుకుని బీసీలకు రిజర్వు చేశారు. నీ 2019 ఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్‌చేయాల్సిన సర్పంచు స్థానాలను జిల్లాలవారీగా నిర్ణయించి కలెక్టర్లకు తెలియజేసింది. నీ 2025 ఎన్నికల కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ మండలాన్ని, పంచాయతీని యూనిట్‌గా తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేయాల్సిన సర్పంచి, వార్డు సభ్యుల స్థానాల సంఖ్యను నిర్ణయించింది. నీ 2019లో 214 గ్రామ పంచాయతీలు పురపాలికల్లో విలీనమయ్యాయి. వీటిలో జనాభా గణనీయ సంఖ్యలో ఉంది. పాత గ్రామ పంచాయతీలను విభజించడం ద్వారా 223 కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో పాత, కొత్త గ్రామ పంచాయతీల్లో బీసీ జనాభా పంపిణీపై ప్రభావం పడింది.

# భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు అని తెలిపారు. సామాజిక న్యాయం సాధనలో భాగమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అని ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్ లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75 వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. తెలుగు, ఒడియా, అస్సామీస్, కశ్మీరీ, బోడో, పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంథం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.ప్రజల స్వాభిమానాన్ని కాపాడే ఎన్నో హక్కులను దేశ ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, అందులో భాగంగానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకొచ్చినట్లు రాష్ట్రపతి చెప్పారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎస్టీ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. వలసవాద మనస్తత్వాన్ని త్యజించి, జాతీయతావాద ఆలోచనా వైఖరి దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం రాజ్యాంగం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు. ఇటీవలి కాలంలో

25 కోట్ల మంది భారతీయులను దారిద్ర్య రేఖ నుంచి బయటికి తీసుకురావడం అనేది భారతదేశ గొప్ప విజయమని ఆమె కొనియాడారు. 1949 సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున (నవంబరు 26), ఇదే భవనం(రాజ్యాంగ సభ సెంట్రల్ హాల్) వేదికగా భారత ప్రజలు రాజ్యాంగాన్ని ఆమోదించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, కొంతకాలం పాటు తాత్కాలిక పార్లమెంటుగానూ రాజ్యాంగ సభ సేవలు అందించింది. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వ్యవహరించారు. ఆయనే మన రాజ్యాంగ ప్రధాన రూపకర్త. ఈ గొప్ప చారిత్రక సందర్భం వేళ మీ అందరి నడుమ ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. దేశ ప్రజల వ్యక్తిగత, ప్రజాస్వామిక హక్కులకు సదా రక్షణ లభించాలని భారత రాజ్యాంగ రూపకర్తలు కోరుకున్నారు అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు.భారత్ ఎప్పటికీ ఒక్కటే అని రాజ్యాంగం నిరూపించింది : ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్

ప్రవేశిక భారత రాజ్యాంగానికి ఆత్మ లాంటిది. భారత్ ఒక్కటే, సదా అది ఒక్కటిగానే ఉంటుందని రాజ్యాంగ ప్రవేశిక నిరూపించింది. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా భారత పౌరులంతా కలిసి పనిచేయాలి. ప్రజా ప్రతినిధులంతా ప్రజల సముచిత కోరికలు, డిమాండ్లను సాధించేందుకు కృషి చేయాలి. ఆ దిశగానే వారు అసెంబ్లీలు, పార్లమెంటులలో చర్చలు జరపాలి. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ దేశమూ గొప్పదిగా ఎదగలేదు. మనమంతా మన పాత్రలను, బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ ప్రత్యేకమైన రోజున నేను మన రాజ్యాంగానికి ప్రణామాన్ని సమర్పిస్తున్నాను. రాజ్యాంగం బోధించిన విలువలకు కట్టుబడి నడుచుకుంటామని మనమంతా ప్రతిన బూనుదాం. సులభతరమైన జీఎస్‌టీ వ్యవస్థ వల్ల వన్ నేషన్ వన్ ట్యాక్స్ విధానం అందుబాటు లోకి వచ్చింది. దీనివల్ల వ్యాపారాలు చేయడం ఈజీగా మారింది. ప్రజల అభ్యున్నతికి మార్గం సుగమం అయింది. సామాజిక న్యాయం, బలహీనవర్గాల ఆర్థిక సాధికారతకు రాజ్యాంగం ప్రాధాన్యత ఇచ్చింద అని సంవిధాన్ సదన్ లోని సెంట్రల్ హాల్‌లో ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్ ప్రసంగించారు.

**రాజ్యాంగాన్ని అనుసరిస్తే 2047 కల్లా వికసిత్ భారత్ : లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా**

రాజ్యాంగాన్ని, దాని సందేశాన్ని దేశ ప్రజలంతా అనుసరిస్తే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుంది. ఇందుకోసం వికసిత భారత్ అనేది మనందరి ఏకైక లక్ష్యంగా మారాలి. రాజ్యాంగ లక్ష్యాలు, విలువలను మనం పాటిస్తేనే, వాటికి అనుగుణంగా నడుచుకుంటేనే వికసిత భారత్‌ను సాధించగలం. అభివృద్ధి, న్యాయం, ఐక్యత, స్నేహభావం, మానవత్వం అనే అంశాల సమాహారంగా ఉండే వికసిత భారత్‌ను సాకారం చేద్దాం. ఈ పవిత్రమైన సంవిధాన్ సదన్ లోనే భారత రాజ్యాంగ రచన జరిగింది. ఇందులోనే మన రాజ్యాంగానికి 1949 నవంబరు 26 న ఆమోదముద్ర లభించింది. దేశ ప్రజల ఆశయాలు ప్రతిబింబించేలా రాజ్యాంగాన్ని రచించారు అని సంవిధాన్ సదన్ లోని సెంట్రల్ హాల్ లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రసంగించారు

## పలు రైల్వే ప్రాజెక్ట్ లకు కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

మంది ప్రయాణికులకు ప్రత్యక్ష ప్రయోజం చేకూరుతుందన్నారు. అలాగే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. పుణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనుందన్నారు. దీని ద్వారా 32 కిలోమీటర్ల మేర కొత్త లైన్ వేసేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్గం ఖరడి నుంచి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుంచి మాణిక్ బాగ్ వరకు ఈ మెట్రొ రైలు నడవనుందన్నారు. ట్రాఫిక్ జామ్‌తో నిత్య నరకం చూస్తున్న పుణే వాసులకు ఇది పెద్ద ఉపశమనం కలిగిస్తుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించి స్వదేశం లోనే దీనిని అభివృద్ధి చేసుకునే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దాంతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (రేంప్) పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 7,280 కోట్లు కేటాయించింది. భారత్‌లో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు.

## బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విధులు పునాది

మొదటి పేజీ తరువాయి

పవిత్ర పత్రం అన్నారు. అందుకే 2015 లో ఎన్‌డిఎ ప్రభుత్వం నవంబర్ 26 వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా గుర్తించింది అని మోదీ గుర్తు చేశారు. మన రాజ్యాంగం ఎంత శక్తి%ఎ%వంత మైనదంటే, ఒక సాధారణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుండి వచ్చిన నాలాంటి వ్యక్తిని 24 సంవత్సరాలకు పైగా నిరంతర ప్రభుత్వ అధిపతిగా పనిచేయడానికి వీలు కల్పించింది. 2014 లో నేను మొదటిసారి పార్లమెంటుకు వచ్చి, ప్రజాస్వామ్యానికి గొప్ప దేవాలయం మెట్లను తాకి నమస్కరించిన క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. మళ్లీ 2019 లో ఎన్నికల ఫలితాలు తర్వాత, నేను సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలు లోకి ప్రవేశించినప్పుడు నేను రాజ్యాంగానికి నమస్కరించి, గౌరవ సూచికంగా దాన్ని నా నుదుటి పై ఉంచుకున్నాను. ఈ రాజ్యాంగం నాలాగే చాలా మందికి కలలు కనే శక్తిని, దాని దిశగా పనిచేసే శక్తిని ఇచ్చింది అని మోదీ అన్నారు. ఈ రాజాంగ దినోత్సవం చాలా ప్రత్యేకమైనది. సర్దార్ వల్లభాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతిని సూచిస్తుంది. వీరిద్దరూ మన దేశానికి మహత్తరమైన కృషి చేశారు. సర్దార్ పటేల్ దార్శనిక నాయకత్వం భారతదేశ రాజకీయ ఏకీకరణను నిర్ధారించింది. పటేల్ చూపిన స్ఫూర్తి ధైర్యసాహసాలే ఆర్టికల్ 370, 35 (ఎ)లకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు మాకు మార్గనిర్దేశం చేశాయి. జమ్మూ కాశ్మీర్‌లో భారత రాజ్యాంగం ఇప్పుడు పూర్తిగా అమలులో ఉంది. ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాలకు అన్ని రాజ్యాంగ హక్కులను నిర్ధారిస్తుంది. మన గిరిజన వర్గాలకు న్యాయం, గౌరవం, సాధికారత కల్పించాలనే భారతదేశం యొక్క సంకల్పానికి భగవాన్ బిర్సా ముండా జీవితం ప్రేరణనిస్తూనే ఉంది అని మోదీ అన్నారు. ఈ సంవత్సరం మనం వందేమాతరం 150 వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నాము. బకించంద్ర చటర్జీ రాసిన మాటలు యుగయుగాలుగా భారతీయుల సమిష్టి సంకల్పంతో ప్రతిధ్వనిస్తాయి. అదే సమయంలో మనం గురు తేగ్ బహదూర్ జీ 350 వ బలిదానం వార్షికోత్సవాన్ని స్మరించుకుంటున్నాము. ఆయన జీవితం, త్యాగం, మనల్ని ధైర్యం, కరుణ, శక్తితో ప్రకాశింపజేస్తూనే ఉన్నాయి. ఇంతటి గొప్ప వ్యక్తిత్వాలు, మనం సాధించుకున్న మైలురాళ్లు, మన విధుల యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తాయి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51 ఎ ప్రాథమిక విధులను తెలియజేస్తాయి. 2049 నాటికి రాజ్యాంగం ఆమోదించి వంద సంవత్సరాలవుతుంది. మనం రూపొందించే విధానాలు, నేడు మనం తీసుకునే నిర్ణయాలు, మన సమిష్టి చర్యలు రాబోయే తరాల జీవితాలను రూపొందిస్తాయి అని మోదీ లేఖలో తెలిపారు. అలాగే దేశ పౌరులు ఎల్లప్పుడూ తమ మనస్సులలో దేశం పట్ల బాధ్యతాయుతమైన విధులను ప్రధానంగా ఉంచుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండి మొదటి సారి ఓటర్లుగా తమ ఓటును వేసిన వారిని గౌరవించాలి. పాఠశాలలు, కాలేజీల్లో రాజ్యాంగ దినోత్సవం జరుపు కోవాలని సూచించారు. మన యువతలో బాధ్యతను, దేశ పౌరులమనే గర్వాన్ని మనం ప్రేరేపించినప్పుడు, వారు జీవితాంతం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉంటారు. ఈ నిబద్ధత భావన బలమైన దేశానికి పునాది అని మోదీ దేశ పౌరులనుద్దేశించి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, 17 శాతానికి తగ్గించారు

- మొదటి పేజి తరువాయి

వరంగల్ జిల్లా అంటేనే పత్తి పంటకు, అజంజాహీ మిల్లుకు పేరుగాంచిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ జిల్లా పూర్వవైభవం కోల్పోయిందని అన్నారు. అలాంటి వరంగల్ జిల్లాలో కేసీఆర్ అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారని తెలిపారు. వరంగల్‌కు మళ్లీ టెక్స్‌టైల్ హబ్ గుర్తింపు తెచ్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. 9,300 ఎకరాల పారిశ్రామిక భూములను విక్రయించి, రాహుల్ గాంధీకి తెలంగాణను ఏటీఎంగా

చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.హైదరాబాద్ నగరం లోపల ఉండే కాలుష్య కారక పరిశ్రమలను, ఫార్మా పరిశ్రమను తరలించడానికి ఫార్మా సిటీని తమ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం...

- మొదటి పేజి తరువాయి

చేయించారు. అనంతరం నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడారు.రాజ్యాంగ దినోత్సవం రోజున ఎమ్మెల్యేగా ప్రమాణం చేయడం తన అదృష్టమని నవీన్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా నవీన్ యాదవ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై తాను వేసిన కేసును వెనక్కి తీసుకున్నట్లు తెలిపారు. గోపీనాథ్ జీవించి ఉన్నా, లేకపోయినా నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిగి ఉండేదని, కేసు కోర్టులో విచారణ దశలో ఉండగానే ఆయన మరణించారని పేర్కొన్నారు.ఉప ఎన్నికలో తమకు మద్దతుగా నిలిచిన ఎంఐఎం పార్టీకి నవీన్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

## నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం

:గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి అరూరు గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా.

● బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బోగారం ధర్మయ్య.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబరు 26.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు బోగారం ధర్మయ్య మాట్లాడుతూ సర్పంచిగా అవకాశము ఇచ్చి గెలిపిస్తే ఆరూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తనకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని కోరినారు.

బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం పది సంవత్సరాలు కృషి చేసినానని, అధిష్టానం అవకాశం ఇస్తే సర్పంచ్ గా పోటీ చేస్తానని, నేను ఇప్పటివరకు ఏ పదవి ఆశించలేదని, గ్రామంలో ఉన్న ప్రజల%శీ%దరితో కలిసిమెలిసి కలుపుకపోయే గుణము ఉన్నాదని, అధిష్టానం కాదంటే ఇండిపెండెంట్ గా కూడా సర్పంచిగాపోటీ చేస్తానని మాట్లాడినారు.

# సేంద్రియ ఉత్పత్తుల భవిష్యత్తు డిమాండ్.

● చరిత ఆర్గానిక్ యూనిట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ .



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్), నవంబర్ 26,** సేంద్రియ ఉత్పత్తులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో అమలవుతున్న సేంద్రియ పద్ధతులు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి ప్రక్రియలు, ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ వ్యవస్థలను సమగ్రంగా పరిశీలించి తగు సూచనలు చేశారు.

యూనిట్‌లో సేంద్రియ విధానాల్లో తయారుచేసే ఉత్పత్తులు విస్తృతంగా ఉన్నాయి. మునగాకు ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు, ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సోప్‌ల సహా మొత్తం 102 రకాల ఉత్పత్తులు సేంద్రియ పద్ధతిలో తయారుచేసి విక్రయిస్తున్నారు. గ్రామీణ వనరులను వినియోగిస్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తులను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ప్రత్యేకత. పరిశుభ్రత, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను కలెక్టర్ ప్రశంసించారు. యూనిట్‌లో సేంద్రీయ పద్ధతుల్లో ఆరోగ్యకరమైన కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం ఉత్పత్తి చేయడం, స్థానిక మార్కెట్‌లో మంచి ఆదరణ పొందడం కూడా కలెక్టర్ అభినందనీయమని చెప్పారు. పక్షులకు అందించే ఆహార దాన సిద్ధం పద్ధతి, గాలి ప్రసరణ, షెడ్, పరిశుభ్రత చర్యలను కూడా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సేంద్రియ ఉత్పత్తులపై భవిష్యత్తులో అత్యధిక డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన దృష్ట్యా సేంద్రియ విధానాలు తప్పనిసరి అవుతున్నాయి అని, కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దానాన్ని బయటి మార్కెట్ నుండి కొనుగోలు చేయకుండా, మొక్కజొన్న పిండి, పల్లి చెక్క వంటి స్థానిక వనరులను ఉపయోగించి సేంద్రియ పద్ధతిలో తయారు చేయడం ద్వారా రైతులకు ఖర్చులను తగ్గించడమే కాక, ఉత్పత్తుల నాణ్యతను పెంచుతుంది, అని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా కౌజు పిట్టల పెంపకంపై ఆసక్తి పెరుగుతోందని, ఇటువంటి యూనిట్లు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయని. భవిష్యత్తులో ఈ యూనిట్ ద్వారా కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దానాన్ని ఇతర గ్రామాలకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించవలసిందిగా సూచించారు.

కలెక్టర్ పరిశీలన కార్యక్రమంలో చరిత ఆర్గానిక్ యూనిట్ చైర్మన్ జయ, డాక్టర్ సోమరాజు దొర, యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తాం

● జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),నవంబర్ 26,** జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయి పారదర్శకత తో, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన పత్రికా సమావేశం లో ఆయన ఎన్నికల ఏర్పాట్లు, ప్రక్రియల పై సమగ్ర వివరాలు వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో భాగంగా రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 29 సాయంత్రం 5 గంటలని పేర్కొన్నారు.

మొదటి విడతలో మారుమూల, సమస్యాత్మక ప్రాంతాలను ప్రాధాన్యంగా తీసుకుని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు , పినపాక, మణుగూరు, కరకగూడెం మండలాల పరిధిలోని 159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 11వ తేదీన పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపుచేసి ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

రెండో విడతలో అన్నపురెడ్డిపల్లి, అశ్వరావుపేట, చంద్రుగొండ, దమ్మపేట, ములకలపల్లి, చుంచుపల్లి, పాల్వంచ మండలాల్లోని 156 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మూడవ విడతలో ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, ఇల్లందు మండలాల్లోని 156 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 4,242 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, నామినేషన్ల స్వీకరణ కోసం 137 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి విడతలో 47 నామినేషన్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు విధుల్లో ఉన్నారని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలను గుర్తించి పోలీస్ శాఖతో సమన్వయం చేసి బలగాల మోహరింపు, వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. తప్పుడు సమాచారంపై నిఘా బలోపేతం చేసామని, అపోహలు, ఉద్రిక్త పరిస్థితులకు అస్సలు అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో కి వచ్చిందని, ఇది మున్సిపాలిటీ ప్రాంతాల కు వర్తించదని ప్రజలు అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రచారానికి సంబంధించి పత్రికా ప్రకటనలు, కరపత్రాలు, ప్రచార సామగ్రి ముద్రణ ఖర్చులను అభ్యర్థులు తప్పనిసరిగా వెల్లడించాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్‌లు, జిరాక్స్ సెంటర్లు ముద్రించిన పత్రికా, కరపత్రాల పై ప్రతుల సంఖ్య, ముద్రణ వివరాలు స్పష్టంగా ముద్రించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని అన్ని అభ్యర్థులు, రాజకీయ నాయకులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠానికి, గ్రామస్థాయిలో పారదర్శకతకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని కార్యాచరణలు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.

# టాటా సేవలు మరవలేము





**జిల్లా అడిషనల్ కలెక్టర్ దార వేణుగోపాల్**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 26,**టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ ప్రారంభించి నేటికీ సంవత్సరం అవుతున్న సందర్భంగా ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ దార వేణుగోపాల్ పాల్గొన్నారు. మొదటి యానివర్సరీ కార్యక్రమం విద్యానగర్లోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ధారా వేణుగోపాల్ మాట్లాడుతూ టాటా అంటేనే ట్రస్ట్, అలాంటిది టాటా ఇన్సూరెన్స్ నేనూ కూడా తీసుకున్నాను... అందరికి ఇన్సూరెన్స్ అనేది చాలా అవసరం. ప్రతి ఒక్కరికి భీమా చేయించడం వలన ఆర్థిక రక్షణ ఉంటుందని తెలియ చేసారు.అలాగే బ్రాంచ్ ఎ డి ఒ ఏ రాము సుర మాట్లాడుతూ బ్రాంచ్ ముందుకు వెళ్ళడానికి ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగడానికి, టాటా ఏ ఐ ఏ ఉపయోగ పడుతుందనియు, ఇంక టాటా సేవలు ఉధృతం చేస్తామని చెప్పారు.బ్రాంచ్ మేనేజర్ సతీష్ జక్కుల మాట్లాడుతూ ఈ సంవత్సర కాలం లో ఎన్ని పాలసీలు చేసి ఎన్ని కుటుంబాలను కాపాడగలిగాము అని,ఎన్నో సేవ కార్యక్రమాలు చేశామని, ఇంకెంతో ముందుకు సాగిపోతామని తెలియ చేసారు.ఓ మహిళా మేలుకో అనే నాటికను(ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్) టాటా ఏఐఏ సీనియర్ బిజినెస్ అసోసియేట్ కమల రాణి కొచ్చెర్ల, ప్రసాద్ లీడర్, బ్రాంచ్ మేనేజర్ సతీష్ జక్కుల అద్భుతంగా ఈ నాటికకు ప్రాణం పోశారు.. అందరికి ఇన్సూరెన్స్ ప్రాముఖ్యత గురించి తెలియ చేసారు.బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చిన వారికి శాలువలు, మెమోటోస్ తో కలక్టర్ సన్మానించారు,వచ్చిన లీడర్స్ కూ అడ్వైసర్స్ అందరికి రతన్ టాటా బ్యాడ్జ్ లు కీ చైన్స్ ఇచ్చారు..ఇందులో బామ్ వెంకటేష్ రాహుల్,లీడర్స్ కొర్ర రాములు, పాషా, సుధాకర్, మానస,పావని మహేష్,సుమన్, ఆనంద్, మానస, సామ్రాజ్యం, జోత్స్న, గాయత్రీ,రాకేష్,దేవరాజ్, చందు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి...




● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 26,**జిల్లాలో 0-5 సంవత్సరాలలోపు వయసు గల పిల్లల ఆధార్ నమోదు చేయిం చాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఒసి కార్యాలయం సమావేశ మందిరంలో విద్య, గ్రామీణాభివృద్ధి, బ్యాంకు, పంచాయతీ, తపాలా,మున్సిపల్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆధార్ మాని టరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలోని 5 సంవత్సరాల లోపు గల పిల్లలందరి ఆధార్ నమోదు చేయిం చాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలు పని చేయాలని, 5 సంవత్సరాలు, 15 సంవ త్సరాలు దాటిన వారు ఆధార్ బయో మెట్రిక్ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్ లేని వారిని గుర్తించి నమోదు చేయించాలని తెలిపారు.

జిల్లాలో మొత్తం ఆధార్ కార్డుల సంఖ్య 10,57,427 అని మిగిలిన వారిని అందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెలలో మొదటి వారంలో ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఆధార్ కార్డు లేని పిల్లల వివరాలను నివేదికలు తయారు చేయాలన్నారు అదేవిధంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఆధార్ కార్డు లేని పిల్లల వివరాలను సేకరించి నివేదికలు అందించాలని ఆదేశించారు వచ్చే మార్చి నాటికి జిల్లా వ్యాప్తంగా అందరికీ ఆధార్ కార్డ్ తప్పనిసరిగా ఉండాలని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి ఒకటవ తేదీ వరకు బయోమెట్రిక్ సవరణల ను ఖచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనంతరం అవసరమైన చోట ఆధార్ క్యాంపులను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొంతమందికి రెండు ఆధార్ కార్డులు మంజూరు అయ్యాయని దానివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఆ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, డిప్యూటీ కలెక్టర్ మురళి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఈడియం సైదేశ్వర రావు,సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రెసిడెంట్, వీరనారి ఆకాంక్ష రెడ్డి



**నవంబర్ 26 (సీ కే న్యూస్) చేగుంట:**ఒక మహిళా శక్తిగా ఆకాంక్షరెడ్డి మరింత ఎదగాలని ఆకాంక్ష

వెల్లివిరిసిన అభినందనలు

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమితులైన ఆంక్షా రెడ్డి ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుడ్డ భాగ్యరాజ్ మంగళవారం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా భాగ్యరాజ్ మాట్లాడుతూ మహిళల నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుందని,ఆ దిశగా అంక్షా రెడ్డి వంటి ధైర్యవంతమైన నాయకులు పార్టీకి బలం చేకూరుస్తారని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు అంక్షా రెడ్డి పోషిస్తున్న పాత్ర ఆదర్శప్రాయమని, ఆమె కొత్త పదవిలో ప్రజలకు మరింత చేరువవుతూ సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాచారం గుట్ట చైర్మన్ రవీందర్ గుప్తా.బాలేష్ గుప్తా సి ఆర్ జానకిరాములు. ఆశాజ్యోతి మల్లేశం. సిద్ధి రాములు.లంబు వెంకటేష్.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే.









**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 26.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని కంచనపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కారోబార్ వడ్డేపల్లి వెంకటేశం కూతురు వివాహం దేవి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది ఈ వివాహానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి,రాష్ట్ర నాయకులు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి మండల నాయకులు పాశం సత్తిరెడ్డి డేగల పాండు మాద శంకర్ రేసు బుచ్చిరెడ్డి జక్కజంగారెడ్డి చెరుకు శివయ్య నూతి రమేష్ మైసోలా ప్రవీణ్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించినారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి.

● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 26,** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. ఐ డి ఓ సి సమావేశ మందిరం నుండి బుధవారం డీ.ఎల్.పీ.ఓలు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు.

బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిపిఓ సుధీర్,అనూష, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వచనాలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమార్తెసందర్భంగామండలానికిచెందినపలువురునాయకులు నూతనవధూవరులనుఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మడిపల్లి భాస్కర్ గౌడ్, కొప్పులగోవిందరావు, ఆలస్యం బసవయ్య ,రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య,కాంగ్రెస్ నాయకులు ఎల్లంపల్లి సతీష్, మడుపల్లి నాగేశ్వరరావు, ఆలస్యం శంకర్ ,ఆలస్యం శ్రీను, కొరివి వీరయ్య తదితరులు ఉన్నారు.

## 30 గంటల నిరాహార దీక్షను జయప్రదం చేయండి .

● పి ఆర్ టి జిల్లా మాజీ అధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వరరావు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు వైవి , రాయల నరసింహారావు, బిక్షం నాగులంచలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించడం జరిగింది . 27, 28 తారీకులలో జరుగు 30 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి



**పెబ్బేరు నవంబర్26 (సి కే న్యూస్)**వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పెబ్బేరు పట్టణ శివారులోని ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకు మీద వెళ్తూ రోడ్డు దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని రంగాపూర్ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎద్దుల రమేష్ (50) తన కుమార్తె భర్త అయిన కొల్లాపూర్ కు చెందిన ప్రవీణ్ (32) ఇద్దరూ కలిసి రంగాపురం నుంచి పెబ్బేరుకు బైక్ పై వస్తున్నారు.ఈ క్రమంలో బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వెళుతున్న కారు ఢీకొట్టడంతో రమేష్, ప్రవీణ్ ఇద్దరూ చెరో చోట తీవ్ర గాయాలతో రోడ్డుపై కింద పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ లో ఇద్దరినీ వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు రమేష్ కు భార్య ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మరో మృతుడు ప్రవీణ్ కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పెబ్బేరు రెండో ఎస్ఐ దివ్య రెడ్డి తెలిపారు.

# నూతన జిల్లా వైద్యాధికారికి సన్మానం



**పెబ్బేరు నవంబర్26 (సి కే న్యూస్)**వనపర్తి జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా సాయినాథ్ రెడ్డికి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి హెల్త్ అసిస్టెంట్ లు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ లు అందరూ మన ఆరోగ్యశాఖ కు సంబంధించిన జాతీయ కార్యక్రమాలు,తెలంగాణకు సంబంధిన కార్యక్రమాలు అందరూ ముందుండి నడిపించాలని తెలిపారు.అలాగే గతంలో ఉన్న హెల్త్ అసిస్టెంట్ లు ఈ జిల్లాకు ఏ విధంగా ప్రజలకు సేవలు అందించారో అలాగే సేవలు అందించాలని మీకు అన్ని విధాల నేను సహకరిస్తానని తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి జిల్లా హెల్త్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**అనంతపురం, (సి కే న్యూస్):**భారత రాజ్యంగ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయపు ప్రధాన సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటగా డా.బి.ఆర్. అంబేడ్కర్ చిత్ర పటానికి పుష్ప నివాళు లు అర్పించారు. అనంతరం చైర్ పర్సన్ గారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, మనం ఈ రోజు స్వేచాగా మాట్లాడుతూ, స్వేచాగా జీవించడానికి మరియు మన దేశంలోని చట్టాలన్ని%శీ%టికీ మూలాధారం - మన భారతదేశ రాజ్యాంగం అని తెలియజేశారు. దాదాపు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి, మంచి ఎక్కడున్నా స్వీకరించాలి అనే విషయాన్ని అనుసరిస్తూ, అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, వాటిలోని విశిష్టమైన లక్షణాలను మన దేశానికి, మన ప్రజలకు ఉపయోగపడే ప్రతిష్టాత్మక రాజ్యాంగంగా రూపొంది%శీ%చారు. కాబట్టి ప్రతి ఒక్కరు రాజ్యాంగ విలువలను, ఆశయాలను తెలుసుకుని, రాజ్యాంగ స్ఫూర్తిని అలవరచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శంకర్, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, పలువురు యం.పి.డి.ఓ లు, పరిపాలనాధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్




**నవంబర్ 26 (సి కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల్ ఎఎంసి మార్కెట్ ఛైర్మెన్ తాడేం వెంగళరావు, తోగుట మండల ఎఎంసి మార్కెట్ ఛైర్మెన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) అలాగే చేగుంట ఉమ్మడి మండల డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా సన్మానించిన చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్, నూతన చేగుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అన్నం ఆంజనేయులు,స్టాలిన్ నర్సింలు, ఫకీర్ నాయక్, వినోద్, శ్రీధర్ రెడ్డి,రఫీక్, డైరెక్టర్ గా నియమితులయ్యారు, ఈ కార్యక్రమంలో విజయపాల్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు చౌదరీ శ్రీనివాస్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు నదీమ్, జేత్రం నాయక్,నర్సింహ రెడ్డి,శంకర్ నాయక్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన పొంగులేటి అభిమానులు.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన పొంగులేటిఅభిమానులు అయిన జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య ,మండల కాంగ్రెస్ నాయకులు ఎల్లంపల్లి సతీష్ బాబు, యువజన కాంగ్రెస్ నాయకులు ఆలస్యం శంకర్, ఆలస్యంశ్రీనివాసరావుతదితరులుమంత్రి పొంగులేటిని కలిసినారు.ఈ సందర్భంగా మంత్రి సంక్షేమ కార్యక్రమాల అమలుతీరుగురించిఅభిమానులనుఅడిగితెలుసుకున్నారు.

# ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండ

**కొత్తచెరువు ముతవల్లి లకు గౌరవ వేతనాల ఆర్థిక చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్**

**పుట్టపర్తి, (సి కే న్యూస్):**ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్తచెరువు మండలంలోని మసీదులో పనిచేస్తున్న మత పెద్దలు నలుగురు ముతవల్లిలకు మూడు లక్షల అరవై వేల రూపాయల గౌరవ వేతనం చెక్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మసీదులో పనిచేస్తున్న మతవల్లిలకు గౌరవేతనం పెంచిందని గుర్తు చేశారు మైనార్టీలంతా కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లీ మాణిక్యం బాబా ఇతర మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## నాగులవంచ గ్రామంలో కరెంట్ షాక్ తో ఎలక్ట్రిషన్ మృతి....

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీ గ్రామానికి చెందిన చెట్టుపోగు రంగయ్య వయసు 37 సం"కరెంటు ప్రైవేట్ హెల్పర్ గా చేస్తుంటాడు. నాగులవంచ గ్రామం పక్కన చి చెరువు వాగు దగ్గర మోటర్ ఫిట్ చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



# పునరావాస కాలనీ పూర్తి అయ్యాకే ఇళ్ళు ఖాళీ చేస్తాం



**నక్కపల్లి, సి కే న్యూస్ :నవంబర్ 26 :** పునరావాస కాలనీ పూర్తి స్థాయిలో నిర్మాణం అయ్యాకే ఇళ్ళు ఖాళీ చేస్తామని అర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు పేర్కొన్నారు. నక్కపల్లి మండలం అమలాపురం పంచాయతీ పాటి మీద గ్రామంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో పాటి మీద, మూలపర్ర, తుమ్మల పేట, తమ్మయ్యపేట, బుచ్చి రాజు పేట, బోయపాడు గ్రామాలలో సుమారు 745 కుటుంబాలను నిర్వాసితులు గా గుర్తించారని అన్నారు. వీరందరికి నక్కపల్లి మండలం పెద బోదుగల్లం వద్ద ఇళ్ళు స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. నేటి వరకు నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఇళ్ళు స్థలాలు అప్పగించలేదని, పూర్తి గా ప్యాకేజీ చెల్లించకుండా ఖాళీ చేయమని వత్తిడి చేయడం మంచిది కాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు కాలనీలో ఇళ్ళు కట్టుకోకుండా ఎక్కడికి పోవాలని అధికారులను ప్రశ్నించారు. ఇళ్ళు కాళీ చేసి వెళ్లి పోతే నెలకు ఐదు వేల రూపాయలు అద్దె చెల్లిస్తామని అధికారులు చెప్పడం విడ్డురంగా ఉందని, ఎక్కడా జరగని విధంగా ఇక్కడ ఏ చట్టం ప్రకారం అలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.

నిర్వాసితులు కాలనీ లో ఇళ్ళు కట్టుకొనే వరకు ఇక్కడినుండి ఇళ్ళు లు కాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఆర్.ఈశ్వరరావు,ఆర్.అప్పారావు, చిన్నమ్మలు, శ్రీను, వెంకటేష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోగులపాలిట సీఎంఆర్ఎఫ్ వరం : యార్లగడ్డ



**గన్నవరం, సి కే న్యూస్ :** వైద్య చికిత్సకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రోగుల పాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధి లోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది రోగులకు ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు 10 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం మంజూరు అయింది. మంజూరయిన చెక్కులను మంగళవారం రాత్రి గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ చేతుల మీదుగా రోగులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి పెట్టి గన్నవరం నియోజకవర్గానికి ఎక్కువ సంఖ్యలో నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద రోగులు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, దయాల రాజేశ్వరరావు, టిడిపి నాయకులు కొమ్మరాజు సుధీర్, పడమటి రంగారావు, గుజ్జర్లపూడి బాబురావు తదితర టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు




**పరవాడ, సి కే న్యూస్ ::** ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరంలో జరిగిన ఆర్చరీ, బాక్సింగ్, షూటింగ్, స్విమ్మింగ్, సాఫ్ట్ బాల్, వుషు క్రీడలలో పాల్గొని బంగారు, వెండి, రజిత పతకాలు సాధించిన క్రీడాకారులు కె.సాయి మనస్వి, సి.హెచ్ ప్రణీత్, ఎన్.మోహిత, వి.ఆద్య జి.జానేష్(ఆర్చరీ). క్రీతి పర్మార్,శ్రీష్టి పర్మార్, మధురిమా (బాక్సింగ్). జె.జయదీప్, ఎమ్. కార్తీక్, జి. రోషిణి(స్విమ్మింగ్). ఎస్.సురేంద్ర, సాయిరవి, త్రిష వర్మ జహీర్ అలీ(షూటింగ్). పి.అభినవ్(వుషు).ప్రతీక్ కుమార్ (సాఫ్ట్ బాల్).లు వారణాసి, ఝూర?ండ్, మణిపూర్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాష్ట్రలలో జరుగు జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటున్నారని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ క్రీడాకారులకు, శిక్షణ ఇచ్చిన నిష్ణాతులైన క్రీడాశిక్షకులు గోవింద్, శివకుమార్, హరినాథ్ రెడ్డి, రాజేష్ కుమార్, రామ్మోహన్, లోహిత్, రమ్య, అమర్నాథ్, అన్నపూర్ణ లకు పాఠశాల సీ.ఈ.ఓ కె. నిశాంత్ అభినందనలు తెలుపుతూ జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

## సత్య లాడ్జిలో జరుతున్న అసాంఘిక కార్యకలాపాల పై చర్యలు తీసుకొండి



**అనకాపల్లి, సి కే న్యూస్ : నవంబర్ 26:** పట్టణం లోని వేల్పుల వీధి జంక్షన్ వద్ద ఉన్న సత్య లాడ్జిలో గత కొన్నేళ్లుగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వాటి పై స్థానిక కూటమి నాయకులు పోలీసులకు పిర్యాదు చేశారు.

బుధవారం అనకాపల్లి టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ ని కలిసి తక్షణమే లాడ్జిలో జరుగుతున్న వ్యభిచార కార్యకలాపాలను నివారించి, లాడ్జి యాజమాన్యంపై చర్యలు తీసుకావాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ గొర్లి శేఖర్,83వ వార్డు జనసేన ఇంచార్జ మంగా ఈశ్వర్,జనసేన పార్టీ నాయకులు వాకాడ బాబు గారు పాల్గొన్నారు.

## ఏపీఐఐసీ డైరెక్టర్గాప్రమాణ స్వీకారం చేసిన రాజేష్

### రాజేష్ కి శుభాకాంక్షలు తెలిపిన పొదిలి దుర్గారావు



**మంగళగిరి, సి కే న్యూస్ :** జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ మంగళగిరి లోని ఏపీఐఐసీ టవర్స్ నందు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితు లై, బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలాధ్యక్షుడు పొదిలి దుర్గారావు పాల్గొని, మండలి రాజేష్‌కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, పొదిలి దుర్గారావు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఏఎంసీ డైరెక్టర్ మేకల స్వాతి, జనసేన నాయకులు కోలా సతీష్ కుమార్, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల నాగరాజు, రూరల్ మండల సంయుక్త కార్యదర్శి షేక్ రిజ్వాన్, అన్నం శెట్టి నాగరాజు, లాయర్ చిన్న, మురళి, రాజా, పవన్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో నూతన వ్యవసాయ మార్గదర్శకాలు

రైతులకు ఐదు సూత్రాలతో అవగాహన.



**మునగపాక, సి కే న్యూస్ :** అనకాపల్లి జిల్లాలో నవంబర్ 24 నుండి 29 వరకు జరుగుతున్న రైతన్న మీకోసం" కార్యక్రమం భాగంగా మునగపాక మండలం లోని తిమ్మరాజుపేట ఆర్ఎస్కె కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, మునగపాక మండల వ్యవసాయ అధికారి రంగా రావు హాజరై రైతులతో నేరుగా మాట్లాడి పంటల నిర్వహణ, శాస్త్రీయ సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, పంటల రక్షణ వంటి అంశాలపై వివరంగా సూచనలు అందించారు.రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఉత్పాదకత పెరగడం, ఖర్చులు తగ్గడం, మట్టి ఆరోగ్యం మెరుగుపడటం వంటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో రైతులకు ఐదు ముఖ్య సూత్రాలను తెలియజేసారు. మట్టి ఆరోగ్యాన్ని పరీక్షించుకుని అవసరమైన ఎరువులు మాత్రమే వినియోగించడం, నీటి నిర్వహణలో మెరుగైన పద్ధతులను అనుసరించడం, పురుగు-వ్యాధుల నియంత్రణలో శాస్త్రీయ మార్గాలను పాటించడం, మరియు మార్కెట్ అవగాహనతో పంటల ప్రణాళికను రూపొందించడం వంటి ఈ ఐదు సూత్రాల అమలు వల్ల రైతుల దిగుబడులు, ఆదాయం స్థిరంగా పెరుగుతాయని అధికారులు గుర్తించారు. రైతుల సమస్యలు, సందేహాలను అధికారులు సమగ్రంగా వినిపించి వెంటనే పరిష్కార మార్గాలను సూచించారు. జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 1,06,000 మంది రైతు కుటుంబాలకు సేవలు అందించబడినట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రైతులను చేరుకుని వారి వ్యవసాయ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు.

## రైస్ కార్డు దారులకు బియ్యం బదులు మూడు కిలోల రాగులు పంపిణీ.



జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి

**అనకాపల్లి, సి కే న్యూస్ ::** జిల్లా లోని రేషన్ కార్డుదారులకు రేపటి నుంచి డిసెంబర్ నెల కోటాలో బియ్యం బదులుగా మూడు కిలోల వరకు రాగులు పంపిణీ చేయనున్నట్టుగా జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు . ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు

జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ కార్డుదారులకు డిసెంబర్ కోటాలో బియ్యంకు బదులుగా మూడు కిలోల వరకు ఉచితంగా రాగులు అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డిసెంబర్ నెల కోటాగా ప్రతి రైస్ కార్డు కుటుంబానికి మూడు కిలోల బియ్యంకు బదులుగా మూడు కిలోల రాగులు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె పేర్కొన్నారు. జిల్లా లోని ప్రతి రేషన్ దుకాణంలో రాగులు పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులు తమ రేషన్ కార్డులతో సంబంధిత దుకాణాలకు వెళ్లి ఈ ప్రయోజనాన్ని పొందవచ్చని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. అన్ని రైస్ కార్డు కుటుంబాలు ఈ సదవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఆర్ఎస్ఎస్ నేత రామ్ లాల్ ని కలిసిన లోకేష్





**అమరావతి, సి కే న్యూస్ :**రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్ లాల్ తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో సమావేశాలలో భాగంగా ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులతో ఆయన భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ చేపట్టిన కార్యక్రమాలు, సంస్థ విశిష్టతను ఈ సందర్భంగా రామ్ లాల్ వివరించారు. అనంతరం రామ్ లాల్ ను మంగళగిరి శాలువాతో మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. బాలల రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూఖ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా బాల వీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, ఆనం రాంనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.

## నేషనల్ హాకీ పోటీలకు నక్కపల్లి విద్యార్థి సత్య దుర్గా రాకేష్ ఎంపిక



**నక్కపల్లి, సి కే న్యూస్ ::**నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి ప్రగడ సత్య దుర్గా రాకేష్ జాతీయ స్థాయి హాకీ పోటీలు కి ఎంపిక అయ్యారు.
ఈ నెల 22 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు తిరుపతి జిల్లా చంద్రగిరి లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు లో పాల్గొన్న ప్రగడ సత్య దుర్గా రాకేష్ అండర్ 14 బాలురు విభాగం లో విజేత గా నిలిచి డిసెంబర్ 22 నుండి మధ్యప్రదేశ్ లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీలలో పాల్గుంటరని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. విజయ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ ఎం విజయ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి జాతీయ హాకీ క్రీడలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి రాకేష్ ను ఉపాధ్యాయులు టి. వి. రమణ, పి. వరలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు నీరజ, ధనలక్ష్మి అభినంధనలు తెలియజేసారు.

## బోదిగల్లం హై స్కూల్లో ఉల్లాసంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు




**నక్కపల్లి, సి కే న్యూస్ :** మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం రాజ్యాంగదినోత్సవ వేడుకలు ఉల్లాసంగా జరిగాయి. హెచ్.ఎమ్. ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రఉపాధ్యాయురాలు ఎ.వి.ఎల్.ఎన్.కుమారి తదితర ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సందర్భంగా డాక్టర్ భీంరావ్ అంబేద్కర్ డా.రాజేంద్రప్రసాద్ వల్లభాయ్ పటేల్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, హెచ్ సి ముఖర్జీ వంటి మహనీయుల చిత్రపటాలతో ఫొటో ప్రదర్శన గావించి విద్యార్థులకు వారిగురించి అవగాహన కల్పించారు. 389 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ దినోత్సవ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థి దశనుంచే రాజ్యాంగ స్ఫూర్తి, రాజ్యాంగంపట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకుని దేశ భక్తి పెంపొందించుకోవాలని హెచ్.ఎమ్.జయశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన,వక్తృత్వం,క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.పాల్గుణరావు, వి.పద్మావతి, రమేష్ బాబు,శ్రీదేవి, నాగేశ్వరరావు ,అమ్మాజీ పాల్గొన్నారు.

## భారీగా పడిన కొబ్బరికాయల ధరలు

కొబ్బరికాయలు ధరలు పెరగడంతో రైతులు, వ్యాపారులు ఆనందంలో మునిగిపోయారు. గత నాలుగు– ఐదు నెలలుగా పెరిగిన ధరలు కొనసాగాయి. అయితే గత కొద్ది రోజులుగా ధరలు పడిపోతున్నాయి. 1000 కొబ్బరికాయలకు గతంలో రూ. 26 వేలు పలుకగా.. ఇప్పుడు రూ. 10 వేలకు వచ్చింది. దీంతో ధర మరింత తగ్గుతుందేమోనని రైతులు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. కాగా, పండుగలు లేకపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి పెరగడం వంటి కారణాలతో ధరలు తగ్గాయని చెబుతున్నారు.గత కొద్దికాలంగా కొబ్బరి ధరలు పెరుగుతూ వచ్చాయి. దీంతో కొబ్బరి రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి పెరుగుదల కనిపించింది. వెయ్యి కొబ్బరికాయలకు రూ. 26 వేల వరకు ధర పలికింది. కొబ్బరి రైతులకు కాసుల వర్షం కురిపించింది. ఇటీవల కొబ్బరికాయల ధరలు పెరగడంతో వ్యాపారులు కూడా సంతోషించారు. పెరిగిన ధరలు సుమారు 4 నెలలు కొనసాగాయి. అయితే గత కొద్ది రోజులుగా కొబ్బరి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో రైతులు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది.కాగా, ధర పెరిగిందని.. వ్యాపారులు కూడా లక్షల్లో కొబ్బరి నిల్వ కాయలను కొనుగోలు చేసి నిల్వ చేశారు. ఈ క్రమంలో కొబ్బరి వెయ్యి కాయలు దాదాపు రూ. 10 వేలు మాత్రమే పలుకుతున్నాయి. ధర పతనం కావడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఒకేసారి కొబ్బరి ధర ఇంతలా పతనం కావడం ఎప్పుడూ జరగలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.కొబ్బరి ధరలు పడిపోవడానికి కొన్ని కారణాలను చెబుతున్నారు. ప్రస్తుతం ఎటువంటి పండుగలు కూడా లేకపోవడంతో కొబ్బరికి డిమాండ్ కూడా తగ్గింది. అంతేకాకుండా కర్ణాటక వంటి రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతి ఎక్కువ ఉంది. దీంతో కొబ్బరి ధర పతనమైందని చెబుతున్నారు. కాగా, ధర పెరిగితేనే తాము నష్టాల నుంచి బయటపడతామని వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొబ్బరి ధరలు మరింత తగ్గుతాయేమోననిఆందోళన చెందుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే కొబ్బరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 1.8 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. అయితే అందులో ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. గతేడాది నుంచి కొబ్బరి ధర రూ. 10 వేలకు తగ్గడం లేదు. పచ్చికాయలతో పాటు నిల్వ కొబ్బరి కాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ మినహా మిగిలిన దక్షిణాది రాష్ట్రాలైనా తమిళనాడు, కర్ణాటక, కేరళలలో కొబ్బరి కాయల దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఇది కాస్త ఆంధ్రా కొబ్బరి రైతులకు కలిసొచ్చింది. దీంతో జూన్– జులై సమయంలో ధర రూ. 22 వేలు పలికింది.ఇక లంక గ్రామాల్లో అయితే.. వెయ్యి కొబ్బరి కాయల ధర రూ. 23 వేల వరకూ పలికింది. కానీ ఇప్పుడు కొబ్బరి ధర రూ. 10 వేల దగ్గర కదలాడుతోంది. దీంతో మరింత తగ్గుతుందేమోనని రైతుల్లో ఆందోళన నెలకొంది.

## పరకామణి కేసులో ట్విస్టులు




వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కేసులు వెంటాడుతూనే ఉన్నాయి. టీటీడీ లడ్డు వివాదం నుంచి కల్తీ మద్యం కేసు వరకు వారిపై కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో కుంభకోణాల కంటే అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ నేతల వ్యవహార శైలి మూలంగా కేసులు నమోదవుతుండడం విశేషం. తాజాగా తిరుమల పరకామణి కేసులో టీటీడీ మాజీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి కి నోటీసులు ఇచ్చింది ప్రత్యేక దర్యాప్తు బృందం. విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో కరుణాకర్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగించినట్లు అవుతోంది. ఎందుకంటే ఆయన టీటీడీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే పరకామణి ఘటన జరిగింది. అందుకే తాజాగా నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

పరకామణి చోరీ కేసులో రవికుమార్ నిందితుడు. అప్పటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్ ఫిర్యాదుదారుడు. అయితే మధ్యలో లోక్ అదాలత్ లో ఫిర్యాదుదారుడిగా ఉన్న సతీష్ రెడ్డి కేసు రాజీ చేసుకున్నారు. దీంతో కేసు కొట్టివేతకు గురయింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఒకటి దాఖలు అయింది. దీంతో కోర్టు విచారణకు ఆదేశించడంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. లోతైన విచారణ జరుగుతున్న సమయంలో ఫిర్యాదు చేసి రాజీ చేసుకున్న సీఐ సతీష్ కుమార్ ను విచారించింది సిట్. రెండోసారి విచారణకు వస్తుండగా మార్గమధ్యలో ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి పై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. హత్య ఆనవాళ్లు కనిపించాయి. కానీ ఈ ఘటన జరిగిన తర్వాత భూమన కరుణాకర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టారు. సతీష్ ది ఆత్మహత్యగా పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసులు హత్య కోణంలో విచారణ చేస్తుంటే ఆత్మహత్యగా ఎలా పరిగణిస్తారు అన్నది ఇప్పుడు ప్రశ్న. అలాగే టిటిడి పరకామణి నగదు చోరీకి సంబంధించిన కేసు రాజీ చేస్తుంటే టీటీడీ అధ్యక్షుడిగా ఏం చేస్తున్నారని ప్రత్యేక దర్యాప్తు బృందం అడిగే అవకాశం ఉంది. ఒకవైపు ఈ చోరీ కేసులో టీటీడీ పాత్రతో పాటు సతీష్ మరణం పై ఆత్మహత్యగా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని.. భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నించే అవకాశం ఉంది.

## పదవుల పందరానికి సిద్ధం

తెలుగుదేశం పార్టీ కూటమిలో చాలామంది నేతలు ఇంకా పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి విషయంలో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల వరకు చాలామంది నేతలకు ఓకే చేశారు. అయితే వాటికి మించిన స్థాయి పదవులు ఆశిస్తున్న వారి విషయంలో మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎందుకంటే పెద్ద పెద్ద పెదవులు భర్తీ చేయడానికి ఆ సమయం రావాలి. ముఖ్యంగా రాజ్యసభ తో పాటు ఎమ్మెల్సీ పదవులను ఖాళీ అయినప్పుడు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే 2026లో భారీ స్థాయిలో ఎమ్మెల్సీలతో పాటు రాజ్యసభ ఖాళీలు ఏర్పడతాయి. తప్పకుండా అప్పుడు నేతలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే గత ఎన్నికల్లో టిక్కెట్లు త్యాగం చేసిన వారు, పార్టీకి ప్రచారం చేసిన వారు, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లినవారు పదవులు ఆశిస్తున్నారు. వారికి ఒక క్రమ పద్ధతిలో పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.సీనియర్ నేతల్లో ప్రధానంగా యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, వంగవీటి రాధాకృష్ణ, పిఠాపురం వర్మ, బుద్ధ వెంకన్న వంటి నేతలకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే అశోక్ గజపతి రాజుకు లైన్ క్లియర్ చేశారు. ఆయన హోదాకు తగ్గట్టు గవర్నర్ పదవి ఇప్పించారు. ఇప్పుడు యనమల రామకృష్ణుడు కు ఏదో ఒక పదవి ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే ఆయన రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. ఒకసారి పెద్దల సభలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. అంటే ఈ ఏడాదిలో ఆయనకు ఛాన్స్ వచ్చినట్టే. మరోవైపు దేవినేని ఉమామహేశ్వరరావుకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆయన వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం టికెట్ ను వదులుకున్నారు. తప్పనిసరిగా ఆయనకు ఎమ్మెల్సీ కానీ.. రాజ్యసభ కానీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజేంద్రప్రసాద్ సైతం పార్టీ వాయిస్ ను గట్టిగానే వినిపించారు. స్థానిక సంస్థల్లో తెలుగుదేశం పార్టీని సజీవంగా నిలబెట్టారు. రాజేంద్రప్రసాద్ తో పాటు బుద్ధ వెంకన్న లాంటి నేతలు 2014లో ఎమ్మెల్సీ పదవులు అందుకున్నారు. వారికి ఇప్పుడు అవే పదవులు ఇవ్వాల్సి ఉంది. వంగవీటి రాధాకృష్ణతోపాటు పిఠాపురం వర్మ పార్టీ కోసం త్యాగాలు చేయడమే కాదు.. కూటమి పార్టీలకు మద్దతుగా ప్రచారం చేశారు. వారికి సైతం ఎమ్మెల్సీ పదవులు సర్దుబాటు చేయాల్సి ఉంది.ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల ఎంపిక జరిగింది. మూడు పార్టీలకు ప్రాధాన్యం దక్కింది. నేతలు నేతలు వారి స్థాయి బట్టి పదవులు కేటాయించారు.

# గ్రేటర్ అమరావతికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

**విజయవాడ, నవంబర్ 25, :**

అమరావతివిషయంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా గత అనుభవాల దృష్ట్యా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్నది ప్రధాన డిమాండ్. అయితే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో పార్లమెంట్ ముంగిటకు అమరావతి బిల్లు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సైతం కోరినట్లు సమాచారం. తాజాగా సిఆర్డిఏ అధికారులకు అమరావతి రైతులు కోరింది ఇదే. ఒకసారి చట్టబద్ధత కల్పిస్తే అమరావతి రాజధానిని కదిలించలేరన్నది రైతుల వాదన. దానిని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది రాష్ట్ర ప్రభుత్వం. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే నెలలో అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ముంగిటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. ప్రస్తుతం అమరావతిలో 29 పంచాయితీలే ఉన్నాయి. అయితే ఇటు విజయవాడ, అటు గుంటూరును కలుపుకొని అమరావతిని ఏకైక నగరంగా గుర్తిస్తే.. గ్రేటర్ హైదరాబాద్ గా మారుతుంది అన్నది చంద్రబాబు ఆలోచన. మొన్న ఈ మధ్యన అదే ప్రకటన చేశారు చంద్రబాబు. 29 పంచాయతీలను అమరావతిగా గుర్తించడం అనేది భావ్యం కాదని.. అమరావతి అనేది ఒక సువిశాల నగరంగా ప్రపంచానికి పరిచయం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే ఇప్పుడు చట్టబద్ధత కల్పించే విషయంలో ఎలా ముందడుగు వేయాలి అన్నది బాబు ముందున్న అంశం. అయితే వచ్చే ఏడాది వరకు నగరపాలక





సంస్థలతో పాటు మున్సిపాలిటీలకు పదవీకాలం గడువు ఉంది. అయితే అంతకంటే ముందే ఈ నగరాలను, పట్టణాలను, పంచాయితీలను అమరావతి కిందకు తెచ్చేందుకు చంద్రబాబు సర్కార్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.గ్రేటర్ హైదరాబాద్ తరహాలో.. గ్రేటర్ అమరావతిని తెస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధికార వర్గాల్లో ఉంది. ఎందుకంటే అటు విజయవాడ, ఇటు గుంటూరు మధ్య అమరావతిని అభివృద్ధి చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అమరావతికి ఆ రెండు నగరాలు తోడైతే ప్రపంచంలోనే ఏకైక నగరంగా నిలపవచ్చు అన్నది కూడా ఆయన ఆలోచన. అందుకే ఈ మూడు నగరాలను కలిపి ఏకైక నగరంగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే ఎంతో బాగుంటుందని అధికారులు సైతం కీలక సూచనలు చేశారట. అయితే ఇప్పటికే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరిందట. మొత్తానికి అయితే అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన అడుగులు పడుతుండడం నిజంగా శుభ పరిణామం.

# కుప్పం, హిందూపురంలు రెండింటి అడ్డా

**తిరుపతి, నవంబర్ 26, :**

తెలుగుదేశం పార్టీ ఏర్పాటయి దాదాపు నలభై రెండేళ్లయింది. అయితే ఈ రెండేళ్లలో అస్సలు ఓటమి ఎరుగని నియోజకవర్గాలు ఆంధ్రప్రదేశ్ లో రెండే రెండు ఉన్నాయి. ఒకటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం ఒకటి కాగా, మరొకటి నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం మరొకటి. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓటమి అనేది తెలుగుదేశం పార్టీకి లేదు. ఇతర పార్టీలకు ఇక్కడి ప్రజలు గెలుపు అవకాశం ఇవ్వలేదు. అభ్యర్థులు ఎందరిని మార్చినా.. పార్టీలు అనేకం పుట్టుకొచ్చినా ఈ రెండు నియోజకవర్గాల్లో మాత్రం పసుపు జెండా నాలుగు దశాబ్దాల నుంచి ఎగురుతూనే ఉంది. అలాగే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రానప్పుడు కూడా ఇక్కడ టీడీపీ జెండా మాత్రం గెలుస్తూనే ఉంది. దీంతో పాటు ఇచ్ఛాపురం, ఉండి నియోజకవర్గాలకు కూడా అదే ట్రాక్ రికార్డు ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ పది సార్లు ఎన్నికలు జరిగితే ఇప్పటి వరకూ 9 సార్లు ఉండి, ఇచ్ఛాపురంలో టీడీపీ అభ్యర్థులను అక్కడి ప్రజలు గెలిపించుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో 1983, 1985 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి ఎన్.రంగస్వామి నాయుడు గెలిచారు. ఇక 1989లో చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోకి అడుగు పెట్టారు. 989, 1994, 1999, 2004, 2009, 2014, 2019, 2024 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు గెలిచారు. మెజారిటీ కూడా పెద్దగా






మార్పులేకుండా గెలిచారు. కర్ణాటక, తమిళనాడుకు సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గం చంద్రబాబుకు అడ్డాగా మారింది. ఇక ఇక్కడ ఎవరు పోటీ చేసినా ఓడి పోవడం ఖాయంగానే భావించి బరిలోకి దిగాల్సి వస్తుంది. అందులోనూ చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడంతో ఇక కుప్పం నియోజకవర్గం చంద్రబాబుకు, టీడీపీకి కేరాఫ్ గా మారింది. హిందూపురం నియోజకవర్గం కూడా అంతే. ఈ నియోజకవర్గం కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. టీడీపీ ఏర్పాటయిన పదకొండు ఎన్నికల్లో టీడీపీయే గెలిచింది. 1983లో రంగనాయకులు, 1985, 1994లోనందమూరి తారక రామారావు, 1996లో నందమూరి హరికృష్ణ, 1999 లో వెంకటరాముడు, 2004లో పి. రంగనాయకులు, 2009 లో అబ్దుల్ ఘని, 2014, 2019, 2024లో నందమూరి బాలకృష్ణ వరసగా హ్యాట్రిక్ విజయాలను సాధించి నందమూరి సొంత నియోజకవర్గంగా మార్చుకున్నారు. వైసీపీ ఎన్ని ప్రయోగాలు చేసినా ఇక్కడ గెలుపు మాత్రం చిక్కడం లేదు.

# విజయసాయిరెడ్డి పార్టీ అడుగులు

**నెల్లూరు, నవంబర్ 26, :**

రాజకీయ పార్టీ పెట్టడం సులువే. కానీ దానిని నడపటమే కష్టం. రాజీనామా చేసినంత సులువు కాదు.. పార్టీని నడపటం. అలాగే ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ వాక్యూమ్ లేదు. అలాంటి చోట మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ పెట్టి ఏం చేయాలని భావిస్తున్నారన్నది అర్థం కాకుండా ఉంది. గతంలోనూ విజయసాయిరెడ్డి మీడియా ఛానల్ ను పెడతానని ప్రకటించారు. తాజాగా రాజకీయ పార్టీని పెడతానని చెప్పారు. అయితే రాజకీయ పార్టీ నడపాలంటే కేవలం పేరు రిజిస్ట్రేషన్ చేస్తేనే సరిపోదు. దానికి కావాల్సిన అంగ, అర్థ బలాలుండాలి. కొత్త పార్టీ పెట్టి గతంలో అనేక మంది చేతులు కాల్చుకున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా కొందరు గుర్తు చేస్తున్నారు. ఏపీలో మరొక కొత్త పార్టీ అవసరమా? అన్న చర్చ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల తర్వాత నడుస్తుంది. వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా వదులుకున్నారు. ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. విజయసాయిరెడ్డి మాత్రం ప్రస్తుతం ఏ



రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. అవసరం వస్తే పార్టీ ఏర్పాటు చేయడానికీ వెనకాడనని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పరాజయం తర్వాత పార్టీకి రాజీనామా చేయడానికి కారణాలు ఈ సందర్భంగా వెల్లడించారు. పలు వర్గాల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చినా దానికి లొంగలేదని చెప్పారు. జగన్ చుట్టూ ఉన్న కొంత మంది తప్పుదారి పట్టించడంతో పరిస్థితి మారిపోయిందని వ్యాఖ్యానించారు. కట్టుబాటు లేని వారి మాటలు నమ్మొద్దని జగన్‌కు సూచించినట్లు చెప్పారు. విజయసాయిరెడ్డి తాను రాజీనామా చేసిన తర్వాత రైతుగా మారాలనుకున్నానని, తాను వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్‌నని గుర్తుచేశారు. ఏ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదని, తాను వెళ్లే ఉద్దేశ్యమూ లేదని తెలిపారు. అయితే పరిస్థితులు బలవంతం చేస్తే పార్టీ ఏర్పాటు చేయడానికి కూడా సిద్ధమేనని చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో రెండు దశాబ్దాల స్నేహం ఉందని, ఆయనపై ఎప్పుడూ విమర్శలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయనని విజయసాయిరెడ్డి అన్నారు. అయితే విజయసాయిరెడ్డి తాను పార్టీ పెట్టినా రాజకీయంగా ఏ మేరకు నిలదొక్కుకుంటారు? లేక పవన్ తో సత్సంబంధాలున్న కారణంతో జనసేనలో చేరతారా? అన్నది త్వరలోనే తేలనుంది. పార్టీ పెడితే చేతులు కాల్చుకున్నట్లేనన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# కొత్త జిల్లాలు... కొత్త మండలాలు...

**విజయవాడ, నవంబర్26,**

పీలో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. అనంతరం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా, మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అలాగే అద్దంకి, పీలేరు, బనగానపల్లె, మడకశిర, నక్కపల్లి రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాల ఏర్పాటుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. కేబినెట్ సబ్ కమిటీ సమర్పించిన నివేదికపైనా చర్చించారు. ఈ క్రమంలోనే ఏపీలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే ముందుగా ప్రచారంలో ఉన్నట్లుగానే మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.మరోవైపు ఏపీలో కొత్తగా మరో ఐదు రెవెన్యూ డివిజన్లు కూడా ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రతిపాదనకు కూడా సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. నంద్యాల జిల్లాలో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. వీటితో పాటుగా కర్నూలు జిల్లాలోని ఆదోని మండలం విభజించేందుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆదోని మండలం విభజించి పెద్దహరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయనున్నారు.మరోవైపు రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడుతోమంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ వివిధ ప్రాంతాలలో పర్యటించి అభిప్రాయాలను తెలుసుకుంది. అనంతరం నివేదిక తయారు చేసిన మంత్రుల కమిటీ ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికపై సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా కసరత్తు చేశారు. అనంతరం మార్కాపురం ప్రజల చిరకాల కోరికను నెరవేరిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుచేసేందుకు అంగీకరించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లెను కొత్త జిల్లాగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు పచ్చజెండా ఊపారు.

**ఏపీలో కొత్త జిల్లాలు**

మార్కాపురంద,,మదనపల్లె,,పోలవరం,ఏపీలో కొత్త రెవెన్యూ డివిజన్లు,అద్దంకి,నక్కపల్లి,పీలేరు,బనగానపల్లె,మడకశిర,కొత్త మండలం,కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని పెద్దహరివనం



# హానికరమైన అవపాతాలు

మనుషులు, మొక్కలు, జలచరాలు తదితర జీవులతో పాటు నేలలు, కట్టడాలపైనా ఆమ్లవర్షాలు హానికరమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ ఉద్గారాలతో వాతావరణంలోని నీటి బిందువులు కలుషితమై వర్షం, మంచు, పొగమంచు, పొడి ధూళి రూపంలో భూమిపై పడుతోంది. వాతావరణంలోని కాలుష్య కారకాలకు తోడు శిలాజ ఇంధనాల దహనంతో తలెత్తుతున్న ఈ పరిస్థితులకు ప్రభావాలు, పర్యవసానాలు, నియంత్రణ చర్యల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. ఆమ్ల వర్షాలు ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన అనర్థాలు, పర్యావరణ వ్యవస్థలతో పాటు మనుషుల ఆరోగ్యంపై కలిగిస్తున్న దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

నీటి ద్రావణానికి ఉండే ఆమ్లత్వం లేదా క్షారత్వాన్ని కొలవడానికి పీహెచ్ స్కేలు ఉపయోగిస్తారు. 1909లో సోరెన్‌సన్ అనే డానిష్ శాస్త్రవేత్త ఈ స్కేలును కనిపెట్టారు. ఇందులో '0' (బలమైన ఆమ్లం) నుంచి 14 (బలమైన ఆల్కలీన్) వరకు రీడింగ్ ఉంటుంది. స్కేలులో పాయింట్ 7 తటస్థతను సూచిస్తుంది.

## ఆమ్ల వర్షాలు

అన్ని రకాల ఆమ్ల అవపాతాలను వివరించడానికి ఉపయోగించే విస్తృత పదం 'ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)'..వాతావరణ కాలుష్య కారకాలైన సల్ఫర్, నత్రజని ఆక్సైడ్‌లు సల్ఫ్యూరిక్, నైట్రిక్ ఆమ్లాలుగా మారినప్పుడు అవపాతం మరింత ఆమ్లంగా మారుతుంది. ఆమ్ల నిక్షేపణ, ఆమ్ల వర్షం, ఆమ్ల అవపాతం తదితరాలన్నీ వాయు కాలుష్య రూపాలే. 'యాసిడ్ రెయిన్' అనే పదాన్ని మొదటగా 1870లో రాబర్ట్ అంగస్ స్మిత్ అనే శాస్త్రవేత్త ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ నగరంలో ఉపయోగించారు. ఆమ్లవర్షం సమస్య కొత్తదేమీ కాదు. కానీ సమస్య స్వభావం పట్టణాలు, నగరాలకు విస్తరించడంతో అంతర్జాతీయ సమస్యగా మారింది. స్మిత్ కాలంలో పట్టణాలు, నగరాల్లో ఆమ్లవర్షం కురిసింది. ప్రస్తుతం వాతావరణంలోకి కాలుష్యాన్ని వెదజల్లే పొడవైన చిమ్నీలను ప్రవేశపెట్టడంతో కాలుష్య కారకాలు వేల కిలోమీటర్లు రవాణా అవుతున్నాయి.

**ఆమ్ల కాలుష్య కారకాల మూలాలు:** వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వల్ల అవపాతం సహజంగా ఆమ్ల స్వభావంతో ఉంటుంది. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ ఉత్పత్తి అవుతాయి. ఇవి అవపాతం ఆమ్ల గుణాన్ని పెంచుతాయి. సల్ఫర్ డయాక్సైడ్, నత్రజని ఆక్సైడ్‌ల ఉత్పత్తి, అగ్ని పర్వతాలు, మహాసముద్రాలు, జీవక్షయం, అడవుల్లో మంటలు మొదలైనవి ఆమ్ల కాలుష్యానికి సహజ కారణాలు. వాటితోపాటు దహన వనరులు కూడా కారకాలే.ఇటీవలి దశాబ్దాల్లో విద్యుత్తు డిమాండ్, మోటారు వాహనాల సంఖ్య పెరగడంతో ఆమ్లీకరణ కాలుష్య కారకాలు, ఉద్గారాలు విపరీతంగా పెరిగాయి. 1950 తర్వాత వచ్చిన పరిణామాలతో కాలుష్య కారక ఉద్గారాలు ఉత్తరార్ధ గోళంలో, ముఖ్యంగా ఐరోపా, ఉత్తర అమెరికాల్లో కేంద్రీకృతమయ్యాయి. దీంతో ఆ దేశాల్లో అవపాతం ఆమ్ల స్వభావాన్ని సంతరించుకుంది. 1970, 1980లో స్కాండినేవియన్ దేశాలు చెట్లు, మంచినీటిపై ఆమ్ల ప్రభావాలను గుర్తించాయి. దానికి కారణమైన కాలుష్యాల్లో ఎక్కువ భాగం ఇతర దేశాల నుంచి రవాణా అయినవే అని గ్రహించారు. దీంతో ఆమ్ల వర్షం అంతర్జాతీయ ఆందోళనగా మారింది.

## ఆమ్ల వర్షం ప్రభావాలు

### చేప జాతులకు ముప్పు

ఆమ్ల వర్షం కారణంగా జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లోని అనేక నీటివనరుల పీహెచ్ విలువ ఐదు కంటే తక్కువగా ఉంటుంది. ఈ ఆమ్ల స్థాయి అనేక చేప జాతులకు ప్రాణాంతకం. ఆమ్ల నీరు మట్టి నుంచి అల్యూమినియాన్ని విడుదల చేస్తుంది. ఇది ప్రవాహాల్లో కలిసి నీటి వనరుల్లోకి చేరుతుంది. ఆల్కలీన్ లేదా న్యూట్రల్ సరస్సుల్లో రాళ్లు, మట్టి, సెడిమెంట్లలో అల్యూమినియం సాంద్రత తక్కువగా ఉంటుంది. పీహెచ్ తగ్గినప్పుడు గతంలో కరగని అల్యూమినియం నీటి ద్రావణంలోకి వెళుతుంది. దాంతో చేపలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది.

### భౌగోళిక పర్యావరణ వ్యవస్థపై ప్రభావం

1) కిరణజన్య సంయోగక్రియ, పెరుగుదల రేటు తగ్గుతుంది.
2) కరవు, వ్యాధులకు సున్నితంగా మారుతుంది.
3) బీన్స్, ముల్లంగి, పాలకూర లాంటి వివిధ రకాల పంటల్లో ఎదుగుదల మందగిస్తుంది.
4) నైట్రోజన్



ఫిక్సింగ్ బ్యాక్టీరియా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇది చివరికి నైట్రోజన్ వలయానికి ఆటంకం కలిగిస్తుంది.
5) స్ప్రూస్, పైన్ బూడిద, బిర్చ్ మొదలైన చెట్లు ఆమ్ల నిక్షేపణకు ఎక్కువగా గురవుతాయి.

### సరస్సు పర్యావరణ వ్యవస్థపై ప్రభావం

అమెరికా, కెనడా, నార్వే తదితర దేశాల్లో వేలాది సరస్సులు ఆమ్లత్వం వల్ల నిరుపయోగంగా మారాయి. ఇందులో ఫైటోప్లాంక్టన్ తక్కువ స్థాయిలో ఉంటుంది. పెంకులున్న నత్తలు, క్లామ్స్, ఇతర జంతువులు ఆమ్ల నీటిలో సులభంగా కరిగిపోతాయి. వీటితో పాటు చేపలూ మరణిస్తాయి. డ్రాగన్ ఫ్లై లార్వా, వాటర్ బోట్ మ్యాన్ లాంటి కొన్ని కీటకాలు ఆమ్ల సరస్సుల్లో ఆహార గొలుసు పైభాగంలో ఉన్న చేపల స్థానాన్ని భర్తీ చేస్తాయి. నీటి మొక్కలు చనిపోతాయి. సరస్సు నాచుతో నిండిపోయి, ఇతర సూక్ష్మజీవులూ నశిస్తాయి.




### నిర్మాణ సామగ్రి నష్టం

ఆమ్ల వర్షంతో రంగులు, స్టీల్, ప్లాస్టిక్ తదితర భవన నిర్మాణ సామగ్రితో పాటు పాలరాయి, సున్నపురాయి మొదలైన వాటికి నష్టం జరుగుతుంది. వాతావరణంలో పెరిగిన ఆమ్లత వల్లే తాజ్‌మహల్ సహజ సౌందర్యం మసకబారుతోంది. దీనికి 40 కిలోమీటర్ల దూరంలో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం.

### మానవాళికి రోగాలు

వాతావరణ ఆమ్లత్వం దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను కలిగిస్తుంది. రాగి, కాడ్మియం, జింక్, పాదరసం తదితర భార లోహాలు ఆమ్ల వర్షం ద్వారా నేల, శిలల నుంచి విడుదలవుతాయి. ఇవి ఆహార గొలుసులోని మొక్కలు, జంతువుల ద్వారా లేదా తాగునీటి రూపంలో మనుషుల శరీరంలోకి చేరతాయి. వాహనాల్లో ఇంధనం మండినప్పుడు వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి. యూఎస్, జపాన్ 1970ల్లో మోటారు వాహనాల ఉద్గారాలను నియంత్రించడానికి కఠినమైన ప్రమాణాలను ప్రవేశపెట్టాయి.వాహన ఉద్గారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరం. వాటి ప్రభావంతో రక్తానికి ఆక్సిజన్ మోసే సామర్థ్యం క్షీణించడంతోపాటు, శ్వాస సమస్యలు ఏర్పడతాయి. ఉత్ప్రేరక కన్వర్టర్ల వాడకంతో వాహనాల ఉద్గారాలను తగ్గించవచ్చు.

## పరిష్కార మార్గాలు

**పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ:** అనేక పారిశ్రామిక వనరుల్లో దహన ప్రక్రియల కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల ఆమ్ల ఉద్గారాలు ఉత్పన్నమవుతాయి. వాటిని తగ్గించడానికి పలు సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. వాటిని దహనానికి ముందు, దహన సమయంలో లేదా తర్వాత ఉపయోగించవచ్చు.

**ప్రత్యామ్నాయ ఇంధనాలు:** కొన్ని ఇంధనాలు సహజంగానే ఆమ్ల ఉద్గారాల పరంగా తక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. కాల్చే బొగ్గులో ఉన్న సల్ఫర్ పరిమాణం ఆధారంగా కాలుష్యం పెరుగుతుంది. థర్మల్ కేంద్రాల్లో తక్కువ సల్ఫర్ ఉండే శిలాజ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, జల, పవన విద్యుత్తు, అలల విద్యుత్తు లాంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించుకోవడం మొదలైన చర్యలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి. డీ-సల్ఫరైజేషన్ ప్రక్రియ వినియోగం, ఇంజిన్లలో మార్పులు తదితర పద్ధతులు కూడా మేలు చేస్తాయి.

ఆమ్ల జలాల్లో హేచరీ చేపలు: ఆమ్లీకరించిన సరస్సుల్లో పర్యావరణ సమతౌల్యత నిర్వహణకు ఈ విధానాన్ని చేపడతారు. చేపల సంఖ్య మరింత క్షీణించకుండా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. భూమి క్షీణతతో భారత వ్యవసాయ ఉత్పత్తిలో 11%-26% వరకు నష్టపోతుండగా, ఆమ్ల వర్షాలు మరింత పెంచుతున్నాయి.



ఆకాన్షా రంజన్ కపూర్ ఎలక్ట్రిక్ బ్లూలో దేశీ దివా గ్లామ్‌ను ప్రసరిస్తుంది

# చిరు ఊచకోత: ఓదెల VS వంగా!




మెగాస్టార్ చిరంజీవి, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా.. ఈ రెండు పేర్లు పక్కపక్కన కనిపిస్తేనే సోషల్ మీడియాలో వైబ్స్ వేరేలా ఉంటాయి. రీసెంట్ గా ప్రభాస్ 'స్పిరిట్' ఓపెనింగ్ ఈవెంట్ లో వీరిద్దరూ కలిసిన తీరు, చిరుని చూసి సందీప్ మురిసిపోయిన విధానం చూశాక మెగా ఫ్యాన్స్ లో కొత్త ఆశలు మొదలయ్యాయి. అయితే, ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వడానికి ముందే ఇండస్ట్రీలో కొన్ని ఇంట్రెస్టింగ్ చర్చలు జరుగుతున్నాయి.నిజానికి చిరంజీవిని సరికొత్తగా, వైల్డ్ గా చూపించే బాధ్యతను ఇప్పటికే మరో ఫ్యాన్ బాయ్ శ్రీకాంత్ ఓదెల తీసుకున్నాడు. గత ఏడాది ప్రకటించిన ఈ ప్రాజెక్ట్, నాని 'ప్యారడైజ్' సినిమా పూర్తయ్యాక సెట్స్ మీదకు వెళ్లే ఛాన్స్ ఉంది. 'దసరా'తో తన టేకింగ్ ఏంటో చూపించిన ఓదెల, మెగాస్టార్ లోని వైల్డ్ యాంగిల్ ను పీక్స్ లో చూపించడానికి స్క్రిప్ట్ రెడీ చేస్తున్నాడు. అంటే, సందీప్ వంగా కంటే ముందే మెగా మాస్ విశ్వరూపాన్ని ఓదెల చూపించబోతున్నాడన్నమాట.మరి సందీప్ వంగా వంతు వస్తే పరిస్థితి ఏంటి? అనేదే ఇప్పుడు అసలు పాయింట్. తన ఫేవరెట్ హీరో దొరికితే ఏ డైరెక్టర్ అయినా అంత ఈజీగా వదలడు. సందీప్ కి మెగాస్టార్ ని డైరెక్ట్ చేయాలనే కోరిక బలంగా ఉంది. చిరు కూడా కంటెంట్ బాగుంటే, ట్రెండ్ కి తగ్గట్టు మారడానికి ఎప్పుడూ నో చెప్పరు. కానీ, ఇక్కడే ఒక చిన్న 'టెక్నికల్ ప్రాబ్లం' ఉంది.సందీప్ మార్క్ సినిమా అంటేనే 'ఎక్స్ట్రీమ్ బోల్డ్ రొమాన్స్' 'హద్దులు లేని ఊచకోత'. చిరంజీవికి ఫ్యామిలీ ఆడియన్స్ లో ఉన్న క్లీన్ ఇమేజ్ కు, సందీప్ రాసే రా అండ్ రస్టిక్ బోల్డ్ సీన్స్ సెట్ అవుతాయా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'యానిమల్' రేంజ్ వైలెన్స్ ను మెగా ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తారు కానీ, అందులో ఉండే బోల్డ్ డ్రామా చిరుకి ఎంతవరకు సూట్ అవుతుందనే సందేహం అందరిలోనూ ఉంది.

ఏది ఏమైనా, శ్రీకాంత్ ఓదెల సినిమా ఒక టీజర్ మాత్రమే అనుకుంటే, భవిష్యత్తులో సందీప్ వంగాతో సినిమా కుదిరితే అది 'సినిమాటిక్ బ్లాస్ట్' లా ఉంటుందని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. ఆ కాంబో గనుక సెట్ అయితే, బాక్సాఫీస్ దగ్గర రికార్డుల వేట కాదు, సాక్షాత్తూ 'ఊచకోత' జరుగుతుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం బంతి చిరు కోర్టులో ఉంది.. ఇక వంగా మార్క్ వైల్డ్ రైడ్ కి బాస్ సిద్ధమేనా అనేది చూడాలి.



ఆకాంక్ష శర్మ ఎమరాల్డ్ గ్రీన్ కో-ఆర్డ్ సెట్‌లో బోల్డ్ మరియు గ్లామరస్‌గా ఉంది

## 2026 లో తమన్నా ఎనిమిది సినిమాలతో!



మిల్కీబ్యూటీ తమన్నా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ ని ముందుకు సాగిస్తోంది. హీరోయిన్ ఛాన్సలులొస్తే? వాటిలో ఒదిగిపోతుంది... స్పెషల్ సాంగ్స్ అంటూ ఎవరొచ్చినా నో చెప్పకుండా కమిట్ అవుతుంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో ఇంత బిజీగా ఉండటం చిన్న విషయం కాదు. ఏనటైనా కొంత జర్నీ అనంతరం విరామంలోకి వెళ్లిపోతారు. కానీ తమన్నా మాత్రం రెస్ట్ లెస్ గా పని చేస్తోంది. ఏ భాషలో అవకాశం వస్తే అక్కడకెళ్లి పని చేస్తుంది. దర్శక, నిర్మాతల, ప్రేక్షకుల మెప్పు పొందుతుంది. ఈ ఏడాది %-%ఓదెల 2%-% లో లీడ్ రోల్ తో అలరించింది.బాలీవుడ్ లో %-%రెయిడ్ 2%-% చిత్రం లో ఐటం పాటతో మెప్పించింది. %-%బాహుబలి ది ఎపిక్%-% రిలీజ్ తోనూ మరోసారి ప్రేక్షకుల్ని పలకరించింది. ఇలా మూడు విజయాలతో అమ్మడు 2025 ని ముగిస్తుంది. కానీ కొత్త ఏడాది 2026 లో మాత్రం తమన్నా నామ సంవత్సరంగానే హైలైట్ అవ్వడానికి అవకాశం ఉంది. అమ్మడు కిట్టీలో ఇప్పటికే ఎనిమిది సినిమాలు కనిపిస్తున్నాయి. జనవరిలో %-%ది రాజాసాబ్%-% రిలీజ్ అవుతుంది. ఇందులో తమన్నా స్పెషల్ సాంగ్ తో అలరించనుంది. తెలుగు సినిమాలో తమన్నా ఐటం పాట ఏ రేంజ్ లో ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు.సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న చిత్రమిది. అటుపై %-%మనశంకర వరప్రసాద్ గారు%-% కూడా రిలీజ్ అవుతుంది. ఇందులో స్పెషల్ సాంగ్ కాక పుట్టించడం ఖాయం. చిరంజీవి సినిమాలో మసాలా సాంగ్ కి ఉండే కిక్కే వేరు. అందులోనూ చిరుతో డాన్స్ షేర్ చేసుకోవడం? అంటే ఇంకే రేంజ్ లో వైరల్ అవుతుందో ఊహకే అందదు. అటుపై బాలీవుడ్ నుంచి ఏకంగా మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందకు రానుంది. %-%ఓ రోమియో%-% ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. %-%రేంజర్%-% వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది. రోహిత్ శెట్టి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఆన్ సెట్స్ లో ఉంది. %-%వివాన్%-, -%రాగిణ ఎమ్ ఎమ్ ఎస్%-% అనే మరో రెండు చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి. ఇవన్నీ వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే సినిమాలే. అలాగే తమిళ్ లో సుందర్. సి ప్రాజెక్ట్ లో నటిస్తోంది. ఇది 2026లోనే రిలీజ్ అవుతుంది. ఇప్పటి వరకూ లైన్ లో ఉన్న చిత్రాలివి. ఇంకా తమన్నా కమిట్ అయిన ప్రాజెక్ట్ లు కొన్ని ఉన్నాయి. వాటి వివరాలు ఇంకా రివీల్ చేయలేదు. తమన్నా వయసింకా 35 ఏళ్లే. పెళ్లి చేసుకోలేదు. ఈ నేపథ్యంలో వృత్తి పరంగా మరికొంత కాలం బిజీగానే ఉంటుంది.